క్లుప్తంగా

శావల్యాపురం తహసీల్దారుగా లక్ష్మీనరసింహం



శావల్యాపురం: నూతన తహసీల్దారుగా పొండ్ల లక్ష్మీ నరసింహం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల్లూరు జిల్లా అత్మకూరు నియోజకవర్గం హనుమ సముద్రపేట మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు సజావుగా ప్రజాప్రతినిధులు ప్రజలు సహకారంతో జరిగేలా ఉన్నతాధికారుల సూచనలు మేరకు విజయవంతమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కార్యాలయ అధికారులు వీఆర్వోలతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పెరిసోముల నాసరయ్య, కార్యాలయ అధికారులు నూతన తహసీల్దారును ఘనంగా సత్కరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన తహసీల్దారు నక్కా లక్ష్మీ లావణ్య బదిలీపై తూర్పు గోదావరి జిల్లాకు వెళ్లారు. బదిలీపై వెళ్లిన తహసీల్దారును ఘనంగా సత్కరించారు.

వాహన తనిఖీల్లో రూ.లక్ష నగదు స్వాధీనం

ప్రత్తిపాడు: వాహన తనిఖీల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకుంది. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన షేక్ కాలేషావలి సరైన పత్రాలు లేకుండా లక్ష రూపాయల నగదుతో చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు కారులో వెళ్తున్నారు. ప్రత్తిపాడు మండలం నడింపాలెం పదహారవ నంబరు జాతీయ రహదారిపై ఉన్న అంతర్ జిల్లా పోలీసు చెక్ పోస్టు వద్ద శనివారం చెక్‌పోస్టు సిబ్బంది తనిఖీలు నిర్వహించగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు.. సరైన పత్రాలు లేకుండా పరిమితికి మంచి తీసుకువెళ్తున్నందున నదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ సోమేశ్వరరావు తెలిపారు.

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

బొల్లాపల్లి: సార్వత్రిక ఎన్నికలు గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వినుకొండ రూరల్ సీఐ యు.సుధాకర్ అన్నారు. మండలంలోని వడ్డెంగుంట, మూగచింతల పాలెం గ్రామాల్లో శనివారం రాత్రి ఓటర్లకు అవగాహన, వీధుల్లో ప్రత్యేక బలగాలతో పాటు పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో గట్టి బందోబస్తు చర్యలు ఉంటాయని, విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు తూచ తప్పకుండాపాటించాలని అన్నారు. పోలీసు కవాతులో బండ్లమోటు ఎస్సై డి. చెన్నకేశవులు, కేంద్ర ప్రభుత్వ బలగాలు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సాయుధ బలగాల కవాతు

చిలకలూరిపేటటౌన్: ఎన్నికలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.నారదముని చెప్పారు. నిత్యం రద్దీగా ఉండే చిలకలూరిపేట పట్టణంలో శనివారం సాయుధ బలగాల కవాతు నిర్వహించారు. ఈ కవాతులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఓటరు ధైర్యంగా ఓటు వేసేలా చైతన్యం కలిగిస్తున్నట్లు చెప్పారు. ఓటరు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లను గుర్తించి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయా పోలింగ్ స్టేషన్లపరిధిలో హింసాత్మక చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి బైండవర్ చేస్తున్నట్లు వివరించారు. కవాతులో ట్రైనీ డీఎస్పీ బి జగదీష్, సీఐ పి.రమేష్, ఎస్ఐలు ఎస్.సుమన్, జి పుల్లారావులు పాల్గొన్నారు.

మినీలారీ ఢీకొని వృద్ధుడికి గాయాలు

నాదెండ్ల: మోపెడ్‌ను మినీలారీ ఢీకొన్న ఘటనలో వృద్ధుడు గాయాలపాలైన సంఘటన జాతీయ రహదారిపై గణపవరం వద్ద శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాగభైరు కోటేశ్వరరావు స్థానిక ఓ ప్రైవేటు కంపెనీలో ఆవుల కాపరిగా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం 9 గంటల సమయంలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు తన మోపెడ్‌పై రోడ్డును దాటుతున్నాడు. మేదరమెట్ల నుంచి విజయవాడ వైపునకు గ్రానైట్ లోడుతో వెళ్తున్న మినీలారీ ఢీకొంది. దీంతో గాయాలపాలైన కోటేశ్వరరావును 108 వాహనంలో చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి గడువు పెంపు

6 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం

క్రోసూరు: ఏపీ మోడల్‌స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశపరీక్ష కోసం దరఖాస్తు స్వీకరణ తేదీని ఏప్రిల్ 6వ తేదీవరకు పెంచినట్లు క్రోసూరు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ మేరీ సుజన్ శనివారం తెలిపారు. ఐదవ తరగతి పాసైన విద్యార్థులు, తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవచ్చునని కోరారు.

పోయిన ఫోను చేతికొచ్చింది



పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించారు ఐనవోలు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి. వినుకొండకి చెందిన ఇండ్ల శ్రీనివాసరావు తన ఫోన్‌ను ఇటీవల పోగొట్టుకున్నారు. అదే విధంగా ప్రకాశం జిల్లా దొనకొండ మండలం కొచ్చర్ల కోట గ్రామానికి చెందిన వంగపాటి సాంబయ్యకు చెందిన ఫోన్ అపహరణకు గురైంది. దీంతో వారిరువురు ఐనవోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా పల్నాడు జిల్లా ఎస్పీ సహకారంతో ఫోన్‌లను ట్రేస్ చేసి బాధితులకు అప్పగించారు.

–వినుకొండ(నూజెండ్ల)

సురేష్‌బాబుకు డబుల్ డాక్టరేట్



మండల కేంద్రానికి చెందిన ముత్తవరపు సురేష్‌బాబుకు డబుల్ డాక్టరేట్ పట్టా వరించింది. కళా, సాంస్కృతిక, సామాజిక సేవ విభాగం, అలాగే ఆధునిక వ్యవసాయ పద్ధతుల నిర్వహణ కేటగిరీలోనూ రెండు గౌరవ డాక్టరేట్‌లు లభించాయి. అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. పాండిచ్చేరీలోని కంబాన్ కళైయరంగం ఆడిటోరియంలో శనివారం ఉదయం 2024 గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. సేంద్రీయ సాగు ఉత్పత్తుల్ని పండించటంలోనూ సురేష్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు.

– యడ్లపాడు

జగనన్న ఆరోగ్య సురక్ష



కనుమలచెరువు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ 2 వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యులు వి.సాయితేజ, కంటి వైద్యులు షేక్ చాంద్ బాషాలు వైద్యచికిత్సలు చేశారు. ఈ వైద్య శిబిరంలో 360 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 15 కంటి వైద్యపరీక్షలు చేసి ఏడుగురికి కళ్ల అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వెల్లటూరు పీహెచ్‌సీ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

–బొల్లాపల్లి

ఆహుతి



నిప్పంటుకుని పండ్లతోట, సోలార్ ప్యానళ్లు, విద్యుత్ మోటార్లు దగ్ధమైన సంఘటన శనివారం గణపవరంలో చోటు చేసుకుంది. కాటా కృష్ణమూర్తి డొంక రోడ్డులో తన అరెకరం భూమిలో పండ్ల తోట సాగు చేస్తున్నాడు. ఇతని భూమికి ఆనుకుని బడుగు ఆనంద్ రెండెకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఆనంద్ భూమిలో సోలార్ ప్యానల్స్, విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకున్నాడు. పండ్ల మొక్కలు, పశుగ్రాసం సాగునీటి అవసరాలకు మూడు విద్యుత్ మోటార్లు అమర్చాడు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడవేయటంతో పండ్ల తోటలోని ఎండుటాకులు, గడ్డికి మంటలు అంటుకున్నాయి.

–నాదెండ్ల

వినుకొండకే మణిహారం

పేదలకు సొంతింటి కలను సాకారం చేసింది ముఖ్యమంత్రి జగనన్నే. ఏవో వల్లమాలిన హామీలిచ్చి వాటిని అమలు చేయని పాలకుల్లా మిగిలిపోకుండా చెప్పిన మాట చెప్పినట్లుగా అమలు చేసి చూపించింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. ఒకటి కాదు రెండు కాదు 120 ఎకరాల్లో రాష్ట్రంలోనే అతి పెద్దదిగా పిలువబడే వినుకొండలోని జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం కార్యరూపం దాల్చుతోంది. దాదాపుగా రెండు వేలకు పైగా ఇళ్లు ఈ కాలనీలో నిర్మాణం పూర్తి చేసుకుని వినుకొండకే మణిహారంగా నిలుస్తున్నాయి.

- జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం
- 120 ఎకరాల్లో 5400 గృహాల నిర్మాణం
- ఇప్పటికే 2 వేల ఇళ్లు పూర్తి



జగనన్న కాలనీలో వివిధ దశల్లో నిర్మాణమవుతున్న ఇళ్లు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రంలో ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లతో పాటు ఊర్లకు ఊర్లు నిర్మిస్తున్నారనేందుకు వినుకొండలోని నిర్మాణమవుతున్న జగనన్న కాలనీయే ఒక ఉదాహరణ. రాష్ట్రంలో పెద్దలేఔట్లలో ఒకటైన వినుకొండలో ఏకంగా 5400లకు పైగా ఇళ్ల నిర్మాణాలు ఒకేచోట 120 ఎకరాల్లో నిర్మాణమవుతున్నాయి. ఒకేచోట ఇన్ని ఇళ్ల నిర్మాణం జరగడమే కాకుండా అందులో విద్యుత్ సబ్‌స్టేషన్, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, పాఠశాలలు, దేవాలయాలు, షాపింగ్‌మాల్స్, క్రీడామైదానం వంటి ఎన్నో అదనపు సౌకర్యాల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ప్రతిపక్షాల విమర్శలకు చెక్....

రాష్ట్రంలో ఎక్కడా ఒక్క ఇల్లు కూడా నిర్మాణం కాలేదని ప్రతిపక్షాలు, స్థానిక టీడీపీ నాయకుల విమర్శలకు చెక్‌పెడుతూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గృహనిర్మాణ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు ఇళ్లు కట్టుకునేలా ప్రోత్సహించడంతో ఒక్కసారిగా నిర్మాణాలు వేగవంతమయ్యాయి. ఊరికి దూరంగా అడవుల్లో ఇచ్చారు ఇళ్లు ఎలా కట్టుకుంటారని టీడీపీ నాయకులు చేస్తున్న విమర్శలను సైతం పట్టించుకోకుండా ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటూ రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



సిద్ధమవుతున్న నివాసాలు



పూర్తిగా నిర్మాణమైన ఇల్లు

జగనన్న కాలనీలో వివిధ దశల్లో ఉన్న నిర్మాణాల వివరాలు

ఇప్పటి వరకు మంజూరైనవి	4955
బేస్‌మట్టం లెవల్	1555
పునాది లెవల్	2586
దర్వాజా లెవల్	95
శ్లాబ్ లెవల్	185
బీమ్ లెవల్	850
ఫిల్లర్స్	105
పునాది తీసినవి	183
తుది దశకు చేరినవి	2 వేలకు పైగా
కట్టుబడి పూర్తయినవి	500లకు పైగా



సకాలంలో బిల్లులు

పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇటీవల ఇంటి నిర్మాణాలు ప్రారంభించే వారికి బేస్‌మట్టం నిర్మాణానికి రూ.20 వేలు సహాయం చేస్తోంది. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలి. ఇప్పటికీ నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు వెంటనే ఇళ్లు నిర్మించుకోవాలి. ఇళ్ల నిర్మాణం చేసే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా బిల్లులు యంత్రాంగం చెల్లిస్తుంది.

– ఎస్.శ్రీనివాస్, హౌసింగ్ డీఈఈ, వినుకొండ

జగనన్న సాయం మరువం



నా భర్త హుస్సేన్ వృత్తి రీత్యా బేల్దారు మేస్త్రిగా జీవనం సాగిస్తున్న మాకు సొంత ఇల్లు లేదు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత జగనన్న కాలనీ ఏర్పాటు చేసి ఇళ్ల స్థలం మంజూరు చేశారు. అయితే ఇచ్చిన హామీ ప్రకారం సకాలంలో బిల్లులు మంజూరు కావడంతో మేమే ఇంటి నిర్మాణం చేపట్టాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేసిన సాయం మరువలేనిది.

–ఎస్‌కె.సైదాబీ

తాగునీటి సమస్య పరిష్కరించిన కార్యసాధకుడు బొల్లా



వినుకొండ (నూజెండ్ల): పట్టణ తాగునీటి సమస్య పరిష్కరించిన కార్యసాధకుడు బొల్లా బ్రహ్మనాయుడని, అటువంటి నాయకుడిని గెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ సీపీ యువజన నాయకులు, ఎమ్మెల్యే బొల్లా తనయుడు బొల్లా గిరిబాబు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గెలుపే లక్ష్యంగా పట్టణంలోని 9వ వార్డులో శనివారం ఆయన విస్తృత ప్రచారం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కట్టుబడి ఉన్నారని, 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడమేకాకుండా, నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకు వెళ్ళేందుకు రానున్న ఎన్నికల్లో మళ్లీ బొల్లా బ్రహ్మనాయుడును ఎమ్మెల్యేగా గెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని, ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా తాగునీటి సమస్య పరిష్కారంతోపాటు గిరిప్రదర్శన రోడ్డు, ఎన్నెస్పీ కాలువ కట్ట అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరిష్కరించారని, ప్రజల ఆశీర్వాదం ఉంటే రానున్న రోజులలో వినుకొండను రాష్ట్రంలోనే పేరున్న నియోజకవర్గంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తీర్చిదిద్దుతానన్నారు. చేస్తున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడం తప్ప, ప్రజలకు టీడీపీ నాయకులు చేసింది ఏమీలేదన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఏకోనారాయణస్వామి తిరునాళ్ల



స్వామి వారి మూలవిరాట్



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి మూలవిరాట్

బొల్లాపల్లి : మండల కేంద్రంలో వేంచేసి ఉన్న ఏకో నారాయణ స్వామి తిరునాళ్ల శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పొంగళ్లతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి చెందిన రైతులు తమ పాడి, పశువులను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి పూజలు చేశారు. స్వచ్ఛంద సంస్థలు పులిహోర, మజ్జిగ, మంచినీరు భక్తులకు స్వచ్ఛందంగా అందజేశారు.

వీరాంజనేయస్వామి తిరునాళ్ల

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం, మర్రిచెట్టు పాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి తిరునాళ్లను శనివారం భక్తులు నిర్వహించుకున్నారు.

ఈ సందర్భంగా ఉదయం నుంచే మహిళా భక్తులు వందలాది మంది పొంగళ్లు నిర్వహించి, స్వామికి నైవేద్యాలు సమర్పించారు. రైతులు పశు ప్రదక్షిణ కూడా నిర్వహించారు. మరి కొందరు భక్తులు ప్రభలతో వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. తిరునాళ్లలో రొంపిచర్ల పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కోనేటి రాయుడికి నీరాజనాలు

రాజుపాలెం: పల్నాడు తిరుపతిగా పేరుగాంచిన నేతి వెంకన్న స్వామి మూడవ శనివారం తిరుణాళ్లకు దేవరంపాడు కొండకు భక్తులు పోటెత్తారు. సమీప ప్రాంతాల నుంచే గాక, సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు దేవరంపాడు కొండకు విచ్చేసి స్వామి వారిని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. గోవింద నామ స్మరణతో కొండ మారుమోగింది. కోనేటి రాయుడికి కోటి దండాలు అంటూ భక్తులు నీరాజనాలు పలికారు. భక్తులు స్వామివారికి పొంగళ్లు చేసి, నెయ్యి, బెల్లం, పప్పు వగైరాలు సమర్పించారు. పశుసంపదను కాపాడాలని స్వామివారికి నెయ్యిని సమర్పించి మొక్కుకున్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తిరుణాళ్లలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అన్నదాన కార్యక్రమాన్ని పరిశీలించారు.



దేవరంపాడు కొండకు పోటెత్తిన భక్తులు

ఆయన వెంట గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ శ్యామకూరి శ్రీనివాసరావు, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, ఈఓ గుర్రం శ్రీనివాసరెడ్డి, సర్పంచి పత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయ దేవస్థానానికి మంచినీటి సౌకర్యం

సత్తెనపల్లి: వేసవిని దృష్టిలో ఉంచుకొని భక్తుల సౌకర్యార్థం పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో వేంచేసియున్న భక్తాంజనేయ స్వామి దేవస్థానానికి మంచినీటి సౌకర్యం కల్పించేందుకు గరే చంద్రశేఖర్ మారుతి శ్రీనివాసు నాగేశ్వరి దంపతులు ముందుకు వచ్చారు. దేవస్థానంలో మంచినీటి బోరు, మోటారు, వాటర్ ట్యాంకర్ తదితర వాటికి రూ.70 వేలు వెచ్చించారు. ఈ సందర్భంగా శనివారం భక్తాంజనేయ స్వామి దేవస్థానం కమిటీ, ఛత్రపతి శివాజీ యూత్ కమిటీ సభ్యులు దాత దంపతులను పూల మాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఛత్రపతి శివాజీ యూత్ కమిటీ సభ్యులు ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం మార్రెళ్లవారిపాలెం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచి 150 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులకు అందించిన సమాచారం మేరకు సివిల్ సప్లయిస్ సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. గ్రామంలోని యక్కంటి వెంకటేశ్వరరెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఈ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా తిరుమల దేవుని కల్యాణం

ఈపూరు: మండలంలోని అగ్నిగుండాల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుమలదేవుని కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. కల్యాణ వేడుకల్లో వైఎస్సార్ సీపీ యువనాయకులు బొల్లా గిరిబాబు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు బొల్లా గిరిబాబును సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రశాంతినగర్, పెద్దచెరువులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం



ప్రశాంతినగర్‌లో డ్రెయిన్‌లో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న డీఇ శ్రీనివాసరావు

నరసరావుపేట: ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా శనివారం మున్సిపల్ అధికారులు 24వ వార్డు ప్రశాంతినగర్, 25వ వార్డు పెద్దచెరువు 9వ లైన్‌లో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. వీటిని మున్సిపల్ డిప్యూటీ ఇంజినీరు ఓలేటి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ప్రశాంతినగర్‌లోని పెద్ద డ్రెయిన్‌ను జేసీబీ ద్వారా పూర్తిగా పూడిక చేయించి వెంటనే ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది



విజయ ప్రసూనను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నాదెండ్ల: విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పాత్ర ఎనలేనిదని హెచ్ఎం ఐ.కృష్ణానాయక్ చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు కె.విజయ ప్రసూన శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సభ నిర్వహించి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణానాయక్ మాట్లాడుతూ, గడిచిన కొన్నేళ్లుగా పాఠశాలలో పనిచేస్తూ ఎంతోమంది విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమన్నారు. ఉద్యోగానంతర జీవితాన్ని ఆయురారోగ్యాలతో సుఖంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది విజయప్రసూనను సత్కరించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం జి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

నియమం నియమమే!



పట్టణంలో తిరుగుతున్న వాహనం

నరసరావుపేట: ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలపై వైఎస్సార్‌సీపీ రంగులను సైతం కన్పించకుండా చేసిన ఎన్నికల అధికారులకు డాక్టర్ కోడెల శివప్రసాదరావు, అతని కుమారుడు ఫొటోలతో పట్టణంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ తిరుగుతున్న స్వర్గపురి శ్మశాన వాహనం కన్పించకపోవటంపై పట్టణ ప్రజలు పలు విమర్శలు గుప్పిస్తున్నారు. గుంటూరురోడ్డులోని స్వర్గపురి శ్మశాన వాటికకు అనుబంధంగా గత కొన్నేళ్ల నుంచి ఈ వాహనంపై శవాలను తరలిస్తుంది. అయితే ఎవరూ ఏనాడు దీనిని అడ్డుకోలేదు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఏ పార్టీ రంగు, మనుషుల విగ్రహాలు, ఫొటోలు బహిరంగంగా కన్పించకుండా చేస్తున్న అధికారులకు యథేచ్ఛగా శవాలను శ్మశానవాటికకు తరలించేందుకు తిరుగుతున్న ఈ వాహనం కన్పించకపోవటం శోచనీయం.